

మౌలిక సదుపాయాల కోసం నిధుల కేటాయింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కోటనందూరు

'సమస్యల వలయంలో వైఎస్ఆర్ కాలనీ' అంటూ ప్రజాశక్తిలో బుధవారం వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. తుని పట్టణం 22వ వార్డులో ఉన్న వైఎస్‌త్ కాలనీతోపాటు, శ్మశాన వాటిక అభివృద్ధికి కుడా ద్వారా రూ.1.50 కోట్ల నిధులను వెచ్చిస్తామని కమిషనర్ ఎ.వెంకటరావు తెలిపారు. ఇప్పటికే పట్టణంలో నెలకున్న సమస్యలపై నివేదికను రూపొందించి ఎంఎల్‌సి యనమల రామకృష్ణుడు, ఎంఎల్ఎ యనమల దివ్యలకు అందించామని తెలిపారు. ఇప్పటికే కుడా నుంచి రూ.1.50 కోట్ల నిధులను కేటాయించారని, ఇప్పటికే 6 సిసి రోడ్ల నిర్మాణానికి ఆమోదం జరిగిందని, త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని కమిషనర్ వివరించారు.

ఉద్యోగ భద్రత లేని 104 సిబ్బంది

- సేవల సిబ్బంది కష్టాలెన్నో
- సక్రమంగా అందని అరకొర వేతనాలు
- పూర్తిస్థాయిలో అమలు కాని పిఎఫ్, ఇఎస్ఐ



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అన్ని ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందించడంలో 104 వాహనాలు చాలా కీలకంగా పని చేస్తున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో వైద్య సేవలు అందించడంతోపాటు అవసరమయ్యే మందులను ఈ వాహనాల ద్వారానే ఇస్తుండడంతో పేద, మధ్య తరగతి రోగులకు ఎంతో ఉపశమనం కలుగుతోంది. అటువంటి సేవలను మరింతగా విస్తతం చేసి వాహన సిబ్బంది సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం సిబ్బంది ఇబ్బందులకు కనీసం గానైనా పట్టించుకోలేదు. అరకొర వేతనాలకే పరిమితం చేసింది. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలపై దష్టిని సారించి పరిష్కారానికి కషి చేయాలని కోరుతున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 60 వాహనాలు ఉండగా అందులో డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటరర్లుగా 160 మంది పని చేస్తున్నారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా గత వైసిపి ప్రభుత్వం ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అమలు చేయడంతో వీరంతా కీలక పాత్ర పోషించారు. గతంలో 104 సేవలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించేది. 5 ఏళ్లుగా అరబిందో సంస్థ బాధ్యతలు చూస్తుండడం వల్ల ఉద్యోగుల సమస్యలను విస్మరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. 104 ఉద్యోగులను ఆప్కాస్ చేర్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని 2019 అక్టోబరు 31న గత ముఖ్యమంత్రి జగన్ హామీని ఇచ్చినా అమలు చేయలేదు.

ఉద్యోగ భద్రతపై ఆందోళన

గత ఐదేళ్ల పాలనలో అనేక కష్టాలు పడిన 104 సిబ్బంది కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఉద్యోగ భద్రత కోసం ఎదురు చూసినా పట్టలేదు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి ముంగిటనే మెరుగైన వైద్యసేవలు అంచాలనే ఉద్దేశంతో నాటి సిఎం వైఎస్. రాజశేఖరరెడ్డి 104 వాహన సేవలు 2008లో ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు నిరంతరం సేవలు అందిస్తూనే ఉన్నా తగిన గుర్తింపు పొందడం లేదు. మరోవైపు ఇస్తున్న అరకొర వేతనాలు ఏ మాత్రం సరిపోవడం లేదు. అవీ నెలనెలా సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం రెండు నెలల వేతనాలు పెండింగులో ఉన్నాయి. ఏడాదిలో నాలుగుసార్లు మాత్రమే వేతనాలు వేస్తున్నారు. క్రమంగా జీతాలు ఇచ్చిన దాఖలాలు లేవు. టెండర్ ప్రకారం వేతనాల పెంపు ఊసెత్తడం లేదు. సకాలంలో వేతనాలు అందని పరిస్థితుల్లో కుటుంబ పోషణ కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిఒ నెంబరు 4459 ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలను సక్రమంగా అమలు చేయాల్సి ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. యాజమాన్యం చెల్లించాల్సిన ఎంప్లాయిర్ కాంట్రిబ్యూషన్ అరబిందో యాజమాన్యం చెల్లించడం లేదు. పిఎఫ్ విషయంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో సర్వీస్ ప్రొవైడర్ ద్వారా నిర్వహిస్తున్న సేవల్లో పిఎఫ్ ఒక వైపు ఉద్యోగి నుంచి మరోవైపు యాజమాన్యం చెల్లించాల్సి ఉంది. కానీ రెండు వైపులా ఉద్యోగుల నుంచే వసూలు చేస్తుండడం దారుణమని వాపోతున్నారు. ఇఎస్ఐలో కూడా కుటుంబ సభ్యులను చేర్చడం లేదు. ఒక్క వాహనానికి కూడ ఇన్సూరెన్స్ లేదు. పూర్తిగా ఫిట్‌నెస్ లేని వాహనాలను తిప్పుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఉద్యోగులకు భద్రత లేదు.



ఉద్యోగ భద్రత లేక ఆందోళన

పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేక చాలా ఆందోళన చెందుతున్నాం. కొత్త ప్రభుత్వమైనా ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలి. కనీస వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి. 104 వాహనాలకు ఫిట్నెస్ ఉండేలా చర్యలు తీసుకోవాలి. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు పక్కాగా అమలు చేయాలి.

- చెల్ల రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎపి 104 యంయంయు ఎంప్లాయిస్ యూనియన్.



104ను ప్రభుత్వమే నిర్వహించాలి

104 సేవలు ప్రభుత్వం నిర్వహిస్తే నెలకు సుమారు రూ.60 వేల వరకూ ప్రజాధనాన్ని అరికట్టవచ్చు. అందువల్ల 104 సేవలను ప్రభుత్వమే పిహెచ్‌సిల ద్వారా నిర్వహించాలి. డిఎస్‌సి ఆర్ఆర్ ప్రకారం నియమించబడి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న వారిని వైద్య, ఆరోగ్య, వివిధ శాఖల్లో కాంట్రాక్ట్ డ్రైవర్లుగా నియమించాలి.

ఎం. త్రిమూర్తులు, 104 ఎంప్లాయిస్ యూనియన్, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి.



దోపిడీకి గురవుతున్నాము

16 ఏళ్ల నుంచి నిత్యం ప్రజలతో మమేకమై ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగులు ఏళ్ల తరబడి సర్వీస్ ప్రొవైడర్ వల్ల తీవ్రమైన దోపిడీకి గురి అవుతున్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల రావాల్సిన ప్రయోజనాలు రాక తీవ్ర నష్టం జరుగుతోంది. నిత్యం యాజమాన్యం ఉద్యోగులను ఇబ్బంది పెడుతూ ఆకారణంగా విధుల నుంచి తొలగిస్తున్నారు. జిఒ నెంబర్ 7ను సవరించి డిఇఒ, డ్రైవర్ల వేతనాలు రూ.32 వేలు వేలు ఇవ్వాలి.

- కె.శ్రీకాంత్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

ఆగస్టు 1న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ షాన్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఆగస్టు నెల పింఛన్‌ను 2,77,594 మందికి రూ.116.77 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జూలై నెలలో 99.06 శాతం పంపిణీని సకాలంలో పూర్తి చేశామన్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచే సచివాలయం సిబ్బంది పింఛన్‌దారులకు తమ ఇంటి వద్దనే సొమ్ము అందజేయడం జరుగు తుందని తెలిపారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ తొలిరోజే నూరు శాతం పంపిణీ చేసేలా అధికా రులు సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు.

చంద్రలేఖ కుటుంబాన్ని ఇబ్బంది పెడితే చర్యలు

ప్రజాశక్తి - పిఠాపురం



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కిషోర్

పిఠాపురం మహారాజ మేనకోడలు విన్నపాల చంద్రలేఖ కుటుంబాన్ని ఇబ్బందులు పెడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ ఇట్ల కిషోర్ హెచ్చరించారు. పట్టణంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉంటున్న తమను జి.లక్ష్మీతో పాటు మరికొంతమంది వచ్చి బెదిరిస్తున్నారంటూ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను సామాజిక మాధ్యమాల ద్వారా చంద్రలేఖ, ఆమె కుమారులు మాధవరావు జనార్ధన కృష్ణ, రంగారావు విన్నవించారు. దీనిపై స్పందించిన పవన్ కళ్యాణ్ కలెక్టర్‌తో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాలతో బుధవారం విచారించారు. చంద్రలేఖ, ఆమె కుమారుల తోపాటు, వారి వద్దనున్న ఆధారాలను సేకరించారు. సదరు ఇంటిని కొన్నామంటున్న లక్ష్మీతో మాట్లాడారు ప్రస్తుతం ఉంటున్న ఇంటిలోనే చంద్రలేఖ కుటుంబ సభ్యులు ఉంటారని ఆర్‌డిఒ తెలిపారు. వివాదం ఏమైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలని అప్పటివరకు ఇంటి జోలికి రావద్దని లక్ష్మీ తదితరులకు సూచించారు. ఎవరన్నా వచ్చిన ఇంట్లో ఉంటున్న కుటుంబ సభ్యుల్ని బెదిరించిన, ఇబ్బంది పెట్టిన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ విచారణలో టిపిఒ శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ రామచంద్రారెడ్డి, అడిషనల్ ఎస్ ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వంటనూనెల్లో స్వయం సమృద్ధి: ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెద్దాపురం



సదస్సులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంచడం ద్వారానే దేశంలో వంట నూనెల్లో స్వయం సమృద్ధి సాధిస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప అన్నారు. మండలానికి చెందిన రాయభూపాల పట్నంలో కల్తూరి శ్రీనివాస్ పామాయిల్ తోటలో ఆయిల్ ఫామ్ తోటల విస్తీర్ణ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటల పెంపకం రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. రైతులు పామాయిల్ తోటల విస్తరణకు కృషి చేయాలన్నారు. రాబోయే ఐదేళ్లలో ఆయిల్ ఫామ్ తోటలు అదనంగా లక్ష ఎకరాలకు పెంచేందుకు రైతులు సహకరించాలన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎన్ మల్లికార్జునరావు మాట్లాడుతూ ఒక ఎకరం పామాయిల్ మొక్కల నిమిత్తం రూ 11,001, మొదటి 4 సంవత్సరాలకు ఎరువుల నిమిత్తం రూ.8,400 వెరసి రూ.27,801 ఉద్యాన శాఖ ద్వారా నేరుగా రైతుల ఖాతాలో జమ చేయబడతాయన్నారు. పతంజలి ఫుడ్స్ డిజిఎం రవీంద్ర మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 7 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగవుతుందన్నారు. ఎంపిపి పెంకే సత్యవతి, సర్పంచ్ సిహెచ్. లక్ష్మి, డిఎంఐఒ వరప్రసాద్, శాస్త్రవేత్త ఎస్.జానకి, ఎఒ కె.సంజయ్‌కుమార్, సుజాత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యప్రభ

ఎంఎల్‌ఎగా రావడం ఆనందకరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చిన్నతనంలో 6 నుంచి ఇంటర్ వరకూ చదువుకున్న స్కూల్‌కు ఎంఎల్‌ఎగా రావడం ఆనందంగా ఉందని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వం హైస్కూల్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైస్కూల్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.బుజ్జి, కూటమి నాయకులు వి.తమ్మయ్యబాబు, ఎం.నారాయణస్వామి, బి.గోపి, వై.నాగబాబు, కె.వెంకట రమణ, రాయుడు చిన్న, ఎస్‌జివి.సుబ్బరాజు, ఎంఇఒ అబ్బాయి, హెచ్‌ఎం ఎన్. లక్ష్మీతులసి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3న జగ్గంపేటలో ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి - కిర్లంపూడి

ఈ నెల 3న జగ్గంపేట ఎంపిడిఒ కార్యాలయంలో వికలాంగులకు అవసరమయైన ఉపకరణాలను పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపిడిఒ బడే రాజేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని కిర్లంపూడి మండలంలోని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లు నమోదు చేయాలి : డిఇఒ

ప్రజాశక్తి - కాకినాడ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డిఇఒ రమేష్, ఇతర అధికారులు

ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ నామినేషన్లను నమోదు చేయాలని డిఇఒ పి.రమేష్ అన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఇన్‌స్పైర్ నామినేషన్స్ సంబంధించిన గోడ పత్రికను అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి తప్పనిసరిగా నామినేషన్స్ పంపించాలని తెలిపారు. ఈ నామినేషన్ ప్రక్రియ జులై 1 నుంచి ప్రారంభమైందని సెప్టెంబర్ 15న ముగుస్తుందన్నారు. 2024కి సంబంధించి కొత్త జిల్లాల ప్రాతిపదికన నామినేషన్స్ స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి 5 నామినేషన్ల చొప్పున ప్రాథమిక ఉన్నత పాఠశాల నుంచి ఆరవ తరగతి వరకూ ఎన్ని తరగతులు ఉంటే అన్ని నామినేషన్స్ సమర్పించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినిల్ మాట్లడుతూ ఇన్‌స్పైర్ మనక్ యాప్ ద్వారా నామినేషన్స్ సులభంగా సమర్పించవచ్చని అన్నారు. అన్ని వివరాలను జాగ్రత్తగా అప్‌లోడ్ చేయకపోతే బ్యాంకు ఖాతాలో డబ్బు జమ అవ్వదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు నాగేశ్వరరావు, జిల్లా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, కోనసీమ జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోవింద్‌ను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల

కందులను పరామర్శించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని జడ్ రాగంపేట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కందుల గోవింద్ చౌదరిని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. ఇటీవల కాలంలో ఆయన గుండె సంబంధిత శస్త్రచికిత్స చేసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఎంఎల్ఎ ఆయన గృహానికి చేరుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కందుల చిట్టిబాబు, పోతుల మోహనరావు, కందుల బాబ్జి, పాలచర్ల సత్యనారాయణ, కంటిపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ అరుణ

మున్సిపాలిటీలో రోజువారి సి బిల్లుల చెల్లింపులో జరుగుతున్న అవకతవకలపై విచారించి తగు చర్యలు తీసుకో వాలని వైసిపి కౌన్సిలర్లు డిమాం డ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ఛైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్య క్షతన కౌన్సిల్ సాధారణ అత్యవసర సమా వేశం జరిగింది. జీరో అవర్‌లో వైసిపి కౌన్సిలర్లు చల్లపల్లి వెంకటేశ్వర రావు, నేతల హరిబాబు, పితాని కృష్ణ తదితరులు ఏళ్ల తరబడి జరుగుతున్న బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు జరుగుతున్నాయని విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నెలవారీగా బిల్లుల చెల్లింపు వివరాలు మున్సిపల్ నోటీసు బోర్డులో ప్రకటించాలన్నారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి పానులపై జీరో అవర్‌లో కౌన్సిలర్‌లు రచ్చ చేశారు. కుళాయి చెరువులో అక్రమ చేపల వేట, జనరల్ ఫండ్ నిధులపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ నేతల హరిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలో అన్ని వార్డులకు ప్రాధాన్యత నిస్తూ సమస్యలు పరిష్కరించాలని వైస్ ఛైర్మన్ ఊబా జాన్ మోజేస్ కోరారు. కాకినాడ పైప్ లైన్‌కు సంబంధించి ఎలాంటి పన్నులు మున్సిపాలిటీకి రావడం లేదని, ఈ విషయంపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టారని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ జె రామారావు వివరణ ఇస్తూ గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటుకు ఆర్ అండ్ బి అధికారుల నుంచి అనుమతి పొందినట్టు యాజ మాన్యం చెప్పిందన్నారు. కౌన్సిల్ ఎజెం డాలో మొదటి అంశాన్ని వాయిదా వేయాలని వైస్ ఛైర్మన్ జాన్ మోసెస్ కోరుతూ మిగిలిన అంశాలను ఆమో దిస్తున్నట్టు చెప్పగా దానికి కౌన్సిలర్ జట్లా మోహన్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

పలువురుకి ఎంఎల్ఎ దాట్ల పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు



వివరాలను తెలుసుకుంటున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

మండలంలోని పలువురు కుటుంబాలను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు బుధవారం పరామర్శించారు. ఇటీవల చెన్నై రైలు ప్రమాదంలో మృతి చెందిన పిల్లి ధరణి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జల్లావారిపేటలో మందనక్క తణుకురాజు, కొంబత్తుల సత్యనారాయణ కుటుంబాలను పరామర్శించారు. మాజీ ఎంపిటిసి సభ్యులు మందపల్లి నాగమ్మ కుమారుడు రాంబాబును పరామర్శించారు. నేర్, కోరంగిలోని పలు కుటుంబాలను ఎమ్మెల్యే పరమర్శించారు. ఆయన వెంట నడింపల్లి వినోద్, టేకుమూడి లక్ష్మణరావు, మోపూరి వెంకటేశ్వరరావు, కట్టా త్రిమూర్తులు, రోల్ల చక్రవర్తి, గంజా సూరిబాబు, పిల్లి సత్తిబాబు, మేడిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి సారే సమర్పణ

ప్రజాశక్తి - పిఠాపురం

వాసవి కన్యకా పరమేశ్వరికి స్థానిక వాసవి భక్త సమాజం మహిళలు సారే సమర్పించారు. కోటగుమ్మం సెంటర్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆషాడ మాసం ముగింపులో భాగంగా బుధవారం స్థానిక శ్రీపాద వల్లభ మహా సంస్థానం నుంచి మహిళలు ఊరేగింపుగా తెచ్చిన సారేను అందించారు. అనంతరం యాత్రికులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో అరుదైన వైద్యం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిజిహెచ్ న్యూరాలజీ విభాగంలో సూపర్ రిఫ్రాక్టరీ ఎపిలెప్సీ అరుదైన వైద్యం అందజేసినట్లు సూపరిండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. అంతర్వేది బుట్టాయిగూడెంకు చెందిన ఒక రోగి జ్వరం బారిన పడి ఫిట్స్ రావడంతో రాజమహేంద్రవరంలోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స అందివగా అక్కడ ఫిట్స్ తగ్గకపోవడంతో జిజిహెచ్‌కు తీసుకురావడం జరిగిందన్నారు. న్యూరాలజీ అసోసియేట్, ఇన్‌ఛార్జ్ హెచ్‌ఒడి డాక్టర్ ఎస్‌ఎం.షరీఫ్, డాక్టర్ రవితేజ బృందం పోస్ట్ వైరల్ సూపర్ రిఫ్రాక్టరీ స్టేటస్ ఎపిలెప్టికస్‌గా గుర్తుంచి ఆరోగ్యశ్రీ లో వైద్యం అందించినట్లు చెప్పారు.

2న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాజులూరు

విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను తొలగించేందుకు మరమ్మతులు చేపడుతున్నందున ఆగస్టు 2న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆర్యభట్ట సబ్ స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ 33/11 కెవి కాజులూరు సబ్ స్టేషన్‌లో గల 11 కెవి ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో కాజులూరు, పల్లిపాలెం, తిప్పరాజుపాలెం, ఐతపూడి గ్రామాలతోపాటు, ఇండస్ట్రియల్ మరియు ఆక్వా ఏరియాలకు విద్యుత్‌ను నిలిపివేయడం జరుగుతుందని అన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలకు మొక్కల వితరణ

ప్రజాశక్తి - కరప

గురజనాపల్లి హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణకు ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఐ.ప్రసాదరావు మొక్కలను వితరణ చేశారు. బుధవారం సుమారు 3 వేలు విలువ చేసే మొక్కలను రప్పించి హెచ్‌ఎం సాయిమోహన్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ కోసం ఉపాధ్యాయుడు మొక్కలను అందించడం అభినందనీయమని అన్నారు.

వైద్య పరికరాల కోసం వర్తకుల సాయం

ప్రజాశక్తి - రౌతులపూడి


స్థానిక సామాజిక ఆసుపత్రిలో దంత వైద్య పరికరాల కొనుగోలుకు కిరాణా వర్తక సంఘం ప్రతినిధులు ఆర్థిక సాయాన్ని అందించారు. బుధవారం ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ జానకి దేవి, దంత వైద్య నిపుణులు డాక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డికి సంఘం ప్రతినిధులు రూ.50 వేల నగదును అందచేశారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో వందశాతం పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషణర్ జె.రామారావు తెలిపారు. పట్టణ పరిధిలో 31 వార్డుల్లో 6,435 మందికి రూ. 2కోట్ల 73 లక్షల 37 వేల రూపాయలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

కార్టూ'నిజం'



బకాయిల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - రౌతులపూడి



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి పథకంలో చేసిన పనులకు రావాల్సిన కూలి కోసం కూలీలు ఎదురుచూపులు చూస్తున్నారు. గత రెండు నెలలుగా కూలి డబ్బులు రాక కూలీలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 5 వేల మంది ఉపాధి పథకంలో కూలీలుగా నమోదు అయ్యారు. వీరిలో రోజు వారీ 3 వేల మంది కూలీలు ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్నారు. వాస్తవంగా చేసిన పనికి చెల్లించాల్సిన కూలిని రెండు వారాల్లోగా కూలీల బ్యాంకు ఖాతాలకు జమ కావాల్సివుంది. అయితే ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో చేసిన పనులకు సంబంధించి 4,600 మంది కూలీలకు 80 వేల పనిదినాలకు సంబంధించి రూ.1,60 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సివుంది. ఇంత పెద్ద మొత్తంలో రావాల్సిన బకాయిల కోసం కూలీలు నెలల తరబడి ఎదురుచూపులు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలీలకు రావాల్సిన బకాయి వేతనాలను వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు. దీనిపై డ్వామా ఎపిఒ సురేష్ మాట్లాడుతూ ఆగష్టు మొదటి వారంలో కూలీలకు రావాల్సిన బకాయిలను వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని ఉన్నతాధికారులు తెలిపారని 'ప్రజాశక్తి'కి తెలిపారు.

వేతనం రాక ఇబ్బందులు

ఉపాధి హామీ వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. పిల్లల చదువులకు అయ్యే ఖర్చులకు వడ్డీలకు తీసుకుని చెల్లిస్తున్నాం. మరోపక్క వ్యాధులతో సతమతం అవుతున్నాం. తక్షణమే తమకు రావాల్సిన కూలి బకాయిలను చెల్లించాలి.

పి.చిన్నమ్మలు, ఉపాధి కూలీ



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారి శ్రీరామ్

కత్తెర పురుగు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మొక్కజొన్న పంటకు నష్ట చేస్తున్న కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవడం జరుగు తుందని వ్యవసా య అధికారి రెడ్ల శ్రీరామ్ తెలిపారు. బుధవారం మండలంలోని కాట్రవు లపల్లి, గుర్రంపాలెం గ్రామాల్లో మొక్కజొన్న, వరి పంటలను పరివీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్క జొన్న పంటకు పట్టిన కత్తెర పురుగును నివారించేందుకు ఎమామెక్టిన్ బెంజిఏట్ 80 గ్రాములు లేదా స్పైనిటరామ్ 100 ఎంఎల్‌ను ఎకరానికి పిచికారి చేయాలన్నారు. వరి పంటలో ఆకు ముడత పురుగు నివారణకు ఎకరానికి 8 కేజీలు చొప్పున కార్టప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ పొడి మందును ఒక లీటర్ నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున లేదా క్లోరిఫైర్‌పాస్ 2 మిల్లీలీటర్లను ఒక లీటర్ నీటికి కలుపుకుని పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ పర్యటనలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.సీతారామశర్మ, ఎం.రామభద్రరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాజులూరు

అప్పుల బాధ తాళలేక ఈ నెల 27వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి బుధవారం కాకినాడ జిజిహెచ్‌లో పరిస్థితి విషమించి మృతి చెందారు. గత రెండేళ్లగా రొయ్యల చెరువు సాగులో నష్టాలు రావడంతో అప్పుల బాధ తట్టుకోలేక ఈనెల 27న టిడిపి కొరంగి గ్రామ కమిటీ అధ్యక్షుడు, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంపల్లి వీర వెంకటచంద్రప్రసాద్ (41) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. బుధవారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని స్వస్థలమైన కోరంగికి తరలించారు. ఆయన మృతి పట్ల ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు, టిడిపి నాయకులు చంద్రమౌళి సంతాపం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని సి.రాయవరం శివారు మార్కండేయపురంలోని పంట కాలువలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సి.రాయవరంకు చెందిన గజ్జి అప్పన్న (60) మృతదేహం బుధవారం లభ్యం కాగా అతని నుదుటిపై, మెడపై గాయాలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు సిఐ శేఖర్‌బాబు, అన్నవరం ఎస్‌ఐ కిశోర్‌బాబు సందర్శించారు. మృతుడికి భార్య అనంతలక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఫోక్సో కేసులో నిందితులకు జైలు శిక్ష

ప్రజాశక్తి - కాజులూరు

ఫోక్సో కేసులో నిందితులకు జైలు శిక్షను కోర్టు ఖరారు చేసినదని ఎస్‌ఐ ఎస్.తులసిరామ్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. 2019లో శీల గ్రామంలో బాలికపై అత్యాచారం జరిగిన సంఘటనలో ఏడుగురుపై కేసు నమోదు అయ్యిందన్నారు. ఈ కేసులో ఎ1 నిందితుడైన చీకురుమిల్లి సునీల్‌కుమార్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా, ఎ 2 నిందితుడైన చీకురుమిల్లి ఏసుబాబుకు జరిమానా విధించినట్లు తెలిపారు. మిగిలిన ఐదుగురుపై కేసు కొట్టి వేశారని తెలిపారు.

పంట బోదెలో పడి రైతు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి రాగంపేట గ్రామానికి చెందిన ఏనుగపల్లి సుందర్ సింగ్(59)అనే రైతు మంగళవారం రాత్రి తన పొలంలోకి వెళ్లి నీరు పెట్టేందుకు బోదెలోకి దిగి ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కాకినాడ ప్రయివేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఓ యువకుడు బుధవారం మృతి చెందాడు. ఇటీవల ఇంటర్మీడియట్లో ఉత్తీర్ణత కాకపోవడంతో మనస్థాపానికి చెందిన నాదెళ్ల వరుణ్ (17) ఈనెల 14వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆ యువకుడిని కాకినాడలోని ఓ ప్రయివేటు హాస్పిటల్లో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. అయితే బుధవారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని కె.గోపాలపురం గ్రామ పరిధిలో నాటుసారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో మురుకుర్తి సూరిచంద్ర నాటుసారా కాస్తుండగా అరెస్టు చేశారు. ఈ దాడిలో 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ముద్దాయిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

అంగన్‌వాడీ సెంటర్లో చేర్పించాలి

కరప : మండలంలోని గొర్రిపూడి గ్రామంలో టిడిపి నాయకులు తమ తమ పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం గ్రామానికి చెందిన జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గండి వెంకటేశ్వరరావు, అంగన్ వాడీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి 3 ఏళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. పిల్లలకి ఇచ్చే ఆహార పదార్థాలు పట్టికను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కానూరి సురేష్, జలదాని నూకరాజు, పొట్లకాయల కృష్ణ, చెక్క గనిరాజు, గణేష్ పాల్గొన్నారు.

కుంగిన రోడ్డు పరిశీలన

పెరవలి : మండలం నిడదవోలు -నరసాపురం కాల్వపై తీపర్రు వద్ద గల వంతెన అప్రోచ్ రోడ్డు గోడ భారీ వర్షాలకు కూలిపోయింది. దీంతో రోడ్డు మార్జిన్ కాలవలోనికి జారిపోయింది. ఈ వంతెన మీదుగా ప్రతి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు కుంగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి కందుల దుర్గేష్ బుధవారం రాత్రి ఈ రోడ్డును పరిశీలించారు. ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడారు. వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవిలో శాశ్వత పటిష్ట చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, బోగవెల్లి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు

చెత్తను సిబ్బందికే అందించాలి

ఉండ్రాజవరం : గ్రామ ప్రజలు తమ ఇళ్ల లోని చెత్తను తడి, పొడిగా వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల వీరవెంకట సత్యనారాయణ అన్నారు. బుధవారం గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ఇంటింటికీ డస్ట్ బిన్నుల పంపిణీని నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పంపిణీ చేపట్టామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్

ఎస్‌సిల భూములు కబ్జా చేస్తే చర్యలు

ప్రజాశక్తి - పిఠాపురం

ఎస్‌సిల భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని కుమారపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015లో కత్తిపూడిలో ఎం గురవయ్యకు చెందిన రూ12 కోట్ల విలువచేసే 5.85 ఎకరాల భూమిని రూ1.92 కోట్లకు మోరంపూడికి చెందిన ఎం వాసుదేవరావు, వెంకటేశ్వరరావు, నారాయణ మూర్తి, కడియానికి జి.చిదానందరావు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ నెల 27న ఎస్‌సి కమిషన్, రెవెన్యూ, పోలీసులు కత్తిపూడిలో విచారించారని తెలిపారు. తమ విచారణలో భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తేలడంతో నలుగురుపైన వివిధ సెక్షన్లతో పాటు, అట్రాసిటీ చట్టం కేసులు నమోదు చేశామన్నారు. కేసులు నమోదు చేసిన వారిని తక్షణం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచాలని పోలీసులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరు సత్తిబాబు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎద్దు సుబ్రహ్మణ్యం, నాయకులు ఎం.పెద్దపండు, ఎం.ప్రేమ్ ప్రదీప్ పాల్గొన్నారు.

8న ఎస్ఎంసి ఎన్నికలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కిర్లంపూడి మండలంలో ఈ నెల 8వ తేదీన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసి) ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఇఒ టి.జోసఫ్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి పాఠశాలల వారీగా సంబంధిత హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాల యాజమాన్య కమిటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యుల భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఎన్నికల అధికారిగా పాఠశాల హెచ్‌ఎం వ్యవహరిస్తారని, ఆగస్టు 8వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. **గండేపల్లి** 2024 - 25 విద్యా సంవత్సరానికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసి) ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడిందని ఎంఇఒ కెహెచ్.నాయక్ తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లను చేయాలని హెచ్‌ఎంలను ఆయన ఆదేశించారు. **కరప** స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నట్లు ఎంఇఒలు కెవి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల పరిశీలకులుగా తాహశీల్దార్, ఎంపిడిఒ, విఆర్ఒ, విఆర్‌ఎలు ఉంటారన్నారు. ఎన్నికల కన్వీనర్‌గా పాఠశాల హెచ్‌ఎంలు కొనసాగుతారన్నారు.

ఎడిఇ సుధీర్‌కుమార్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

విద్యుత్ శాఖలో 41 ఏళ్లపాటు వివిధ స్థాయిలో పనిచేసి ఎడిఇ కలవల జాన్‌విక్టర్ సుధీర్‌కుమార్ సేవలు ఆదర్శనీయమని ట్రాన్స్ కో ఎస్ఇ గిరిబాబు, ట్రాన్స్ కో మాజీ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ కొనియాడారు. కాకినాడ రమణయ్యపేటలోని ట్రాన్స్ కో కార్యాలయంలో డిఇఇ సుధీర్ కుమార్ పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా పనిచేసిన సుధీర్ కుమార్ నీతి నిజాయితీతో సంస్థ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు రహమతుల్లా, విజయకుమార్, చంద్రప్రసాద్, పైడిరాజు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, బంధువులు పాల్గొన్నారు.



సుధీర్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో ఆదిత్య విద్యార్థులు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డును అందుకుంటున్న ఆదిత్య విద్యార్థులు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఫోరెన్సిక్ సైన్స్ విభాగం విద్యార్థులు ఒక గంటలో 1,037 ఫోరెన్సిక్ శాస్త్రీయ పద్ధతులను అనుసరించి వేలిముద్రలు సేకరించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సరి కొత్త రికార్డును సృష్టించారు. బుధవారం ఆదిత్యలో జరిగిన ఈ కార్యక్రమంలో సిటిఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ కె.సరళ, సిఐడి ఫింగర్ ప్రింట్ బ్యూరో ఎస్ఐ ఎస్ . ప్రశాంతి పాల్గొని విద్యార్థుల ఫోరెన్సిక్ శాస్త్రీయ పద్ధతి ద్వారా వేలిముద్రలను తీసుకోవడాన్ని పరిశీలించారు. కళాశాల ఫోరెన్సిక్ విభాగానికి చెందిన మాసపత్రిక ను విడుదల చేశారు .కళాశాల ప్రిన్సిపల్ విలాస్‌అనిల్ చవాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సంపాదించిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల అధిపతి డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, డా సుగుణ రెడ్డి అభినందించారు.

లక్ష్యం దిశగా అడుగులు వేయాలి : డివైఇఒ

ప్రజాశక్తి - కాజులూరు

ప్రతి విద్యార్థి 10వ తరగతి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని అడుగులు వేయాలని డివైఇఒ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. ఏకాగ్రతతో విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ సాధించిన నలుగురు విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యాళ్ల కృష్ణారావు, దాత అన్నం శ్రీరామచంద్రమూర్తి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - పెద్దాపురం



ఛైర్‌పర్సన్ తులసి మంగతాయారు

పట్టణ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బుధవారం ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా, ఆరేళ్ల వీర రాఘవ, త్సలికి సత్యభాస్కరరావు మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదన్నారు. పట్టణ పరిధిలో ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో పారిశుధ్య నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఛైర్‌పర్సన్ తులసి మంగతాయారు మాట్లాడుతూ అన్ని వార్డుల పరిధిలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. 23 వ వార్డు కౌన్సిలర్ ముప్పన శ్యామలాంబ మాట్లాడుతూ కమ్యూనిటీ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని ఇంజనీరింగ్ అధికారులు చెప్పటం తప్ప ఆ నిధులతో పనులు జరగడం లేదన్నారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన టిపిఎస్, టిపిఒలు లేక పనులు జరగటం లేదన్నారు. దీనివల్ల ఆదాయం కుంటుపడుతుందన్నారు. వెంటనే టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల నియామకం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, కమిషనర్ కెవి.పద్మావతి, మేనేజర్ జ్యోతిరాణి, డిఇఇ ఆదినారాయణరావు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఐని ప్రశంసించిన ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలేశ్వరం




రివార్డును అందుకుంటున్న ఎస్ఐ

ప్రత్తిపాడులో వైద్య ఉద్యోగి ఇంట్లో జరిగిన చోరీ కేసును 48 గంటల్లో ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ బుధవారం అభినందించారు. కాకినాడ ఎస్‌పి కార్యాలయంలో ఏలేశ్వరం ఎస్ఐ జి.సతీష్‌తోపాటు, ప్రత్తిపాడు, రౌతులపూడి ఎస్ఐలు పవన్‌కుమార్, వెంకటేశ్వరరావు లను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను, రివార్డులను అందజేశారు.

కమిషనర్‌ను కలిసిన ఎంఎల్ఎలు

ప్రజాశక్తి - కాకినాడ



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న వనమాడి

కాకినాడ సిటీ, రూరల్ నియోజక వర్గాల ఎంఎల్ఎలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ నగర పాలక సంస్థ కమిషనర్ భావనను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెను నగరపాలక సంస్థ కార్యాలయంలో వారు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తమ నియోజకవర్గం పరిధిలోని పలు అభివృద్ధి అంశాలు, సమస్యలపై కమిషనర్‌తో చర్చించారు.

ఘనంగా మరిడమ్మ సంబరాలు

ప్రజాశక్తి - పెద్దాపురం



జాతరలో బండ్ల వేషాలు

మరిడమ్మ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కుమ్మరి వీధి, నువ్వుల గుంట వీధి ప్రాంతాల ప్రజలు ఏర్పాటు చేసిన గరగల నృత్యాలు, పెద్దపులాటలు, సాము గరిడీలు, జానపద కళారూపాలు, విద్యుత్ దీపాలంకరణ మధ్య ఏర్పాటు చేసిన బండ్ల వేషాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. సిఐ రవికుమార్, ఎస్ఐ వి.సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. నువ్వుల గుంట వీధి కమిటీ సభ్యులు తమడపు బాబురావు, కూనిరెడ్డి నారాయణస్వామి, లక్ష్మణ్, వీరబాబు, శ్రీకాంత్, త్రినాథ్ పర్యవేక్షించారు.

650 మందికి కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి



కళ్లజోళ్లు అందిస్తున్న నిర్వహకులు

కొత్తపల్లి సురక్ష ప్యాలెస్‌లో 650 మందికి సురక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ చేశారు. ఈనెల 14న శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన వారికి బుధవారం అందచేశారు.

పాఠశాలల్లో ఎంఇఒలు తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వేట్లపాలెం, గొంచాల పాఠశాలల్లో ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తనిఖీలు చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యా ప్రవేశ కార్యక్రమాలపై ఆరా తీశారు. విద్యార్థుల వర్క్ బుక్ కరెక్షన్స్, టెక్స్ట్ బుక్ కరెక్షన్స్, సిలబస్ పరిశీలించారు. ప్రధానంగా ప్రాథమిక పాఠశాలలో ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీష్‌లోని అంశాలను చదవాలని, రాయాలని దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధుల నుంచి యానిమేటర్ తొలగింపు

ప్రజాశక్తి-ఆలమూరు

డ్వాక్రా సంఘాల నిధుల గోల్మాల్ అంశంలో ఆలమూరు వన్ యానిమేటర్ శిరోమణిని విధుల నుంచి తొలగిస్తూ ఆలమూరు గ్రామ సమాఖ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారని ఎపిఎం ఎం.ధనరాజు బుధవారం తెలిపారు. సంఘాల నిధులను దారి మళ్లించినట్లు శిరోమణి పై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో స్త్రీ నిధి జిల్లా ఎజిఎం ప్రసన్నలక్ష్మి, డిపిఎం ఎం.శామ్యూల్ ఆధ్వర్యంలో గతంలో జరిపిన విచారణలో రూ. 3.75 లక్షల నిధులు గోల్మాల్ జరిగినట్లు గుర్తించారు. అప్పట్లో ఆమె ఈ నిధులను తిరిగి చెల్లించడానికి అంగీకరించారు. దీంతో డిఆర్‌డిఎ పీడీ ఆదేశాల మేరకు ఎపిఎం ధనరాజు ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య సెక్రటరీ వారా దుర్గాదేవి అధ్యక్షతన గ్రామ పెద్దలు ఒంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, మానేపల్లి శ్రీనివాస్ తదితరుల సమక్షంలో బుధవారం గ్రామ సమాఖ్య అత్యవసర సమావేశం నిర్వహించారు. నిధులు గోల్మాల్ చేసిన యానిమేటర్ శిరోమణిని తొలగించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామ సమాఖ్య తీర్మానం మేరకు శిరోమణిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఎపిఎం ధనరాజు తెలిపారు. దుర్వినియోగం చేసిన నిధులను అక్టోబర్ నెలలోపు చెల్లిస్తానని శిరోమణి లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారన్నారు. గడువు లోపు చెల్లించని ఎడల ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎపిఎం తెలిపారు.

3న ఆదిత్యలో 'లీగల్ లిటరసీ క్యాంప్'

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమహేంద్రవరం వారి సూచనల మేరకు లీగల్ లిటరసీ క్యాంప్‌లో నిర్వహణలో భాగంగా ఆగస్టు మూడో తేదీ శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక ఆదిత్య జూని యర్ కాలేజ్ నందు లిటరసి క్యాంప్ నిర్వహించనున్నట్లు రెండవ అదనపు జిల్లా న్యాయ మూర్తి, మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ వి నరేష్ బుధ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్యాంపును మాదకద్రవ్యాల దుర్వినియోగం, మాదక ద్రవ్యాల నిర్మూలన, బాధితులకు చట్టపరమైన సేవలు అనే అంశంపై నిర్వహిస్తారని తెలిపారు.

పాడి పరిశ్రమ రక్షణకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-ఆలమూరు



పశువుల దాణా పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ బండారు

ఎపిలో పాడి పరిశ్రమకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మూలస్థాన అగ్రహారం పశు వైద్యశాల వద్ద తోకలంకకు చెందిన పాడి రైతులకు రెండు టన్నుల పశువుల దాణా, సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండేకు మందులను పశుసంవర్ధక శాఖ జెడి కె.వెంకటేశ్వరరావుతో కలిసి బుధవారం ఆయన అందజేశారు. ఎంఎల్ఎ బండారు మాట్లాడుతూ లంక ప్రాంతాల్లో ఇటీవల గోదావరికి వచ్చిన వరదలకు పశువుల మేత పాడైందన్నారు. సమస్యను రైతులు స్థానిక నాయకులు ద్వారా తన వద్దకు తీసుకురావడంతో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులతో చర్చించి తోకలంక రైతులకు పశువులు దాణాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే కొత్తపేట నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాల పశు పోషక రైతు లకు పశువుల దాణాను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమ ంలో రావులపాలెం వెటర్నరీ ఎడి ఎస్.ఉమామహేశ్వర రెడ్డి, పశువైద్యులు ఎం.సోమేశ్వరరావు, వి.వరలక్ష్మి, సర్పంచ్ లంక వరప్రసాద్, సలాది జయ ప్రకాష్ నారాయణ, గానుగుల చిన్న, సూరపు రెడ్డి సత్య, తోరాటి అర్జునరావు, తోట మూల స్వామి, దొంగ భాస్కరరావు, ఆకుల సత్య నారాయణ,రైతులు, నాయకులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల వ్యవస్థ బలోపేతానికి అభిప్రాయాల సేకరణ

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరసరఫరాల వ్యవస్థ బలోపే తానికై క్షేత్రస్థాయి నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశపు హాలు నందు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పౌరసరఫరాల అధికారులు మధ్యా హ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, సాంఘిక సంక్షేమ బిసి సంక్షేమ వసతి గృహ అధికారులు నుంచి సూచనలు, సలహాలు స్వీక రించారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారులు తమ సూచనలను తెలుపుతూ పోర్టిఫైడ్ స్టీమ్డ్ రైస్ సరఫరా చేస్తే రుచికరంగా పోషక విలువలు ఉండే విధంగా వండి వడ్డిస్తే మంచి ప్రయోజనం ఉంటుందన్నారు. పోర్టి ఫైడ్ స్టీమ్డ్ రైస్ తో పాటుగా పప్పు, ఆయిలు చోడి పిండి బెల్లం చిరుధాన్యాలు పౌరసరఫరాల శాఖ నుంచే డోర్ డెలివరీ చేయాలని తెలిపారు. వంటలు వండే సిబ్బందికి కూడా పోషక విలువలు సమర్థిగా అందేలా వివిధ రకాల వంటలను తాజాగా వండి వడ్డించే విధానాలపై నూతన ఒరవడిని అవలంబిం చాలన్నారు. గతంలో మండపేట ప్రాంతంలో స్టీమ్ రైస్ పైలెట్ ప్రాజె క్టుగా సరఫరా చేశారని,ఈ వంటకంపై ఆశించిన ఫలితాలు రావడం జరిగిందన్నారు. ఎన్ఫోర్స్మెంట్ విభాగంలో కూడా చెక్పోస్టుల వద్ద డిప్యూటీ తహశీల్దార్లను నియమించి ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అక్రమ బియ్యం పై 6ఎ కేసులు పెట్టడంతోపాటు అక్రమ రవాణాకు వినియోగించే వాహనాల డ్రయివర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు వాహన ఆర్‌సి బుక్కులను రద్దు పరచాలని పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్లు సూచించారు. అవసరమైతే తరచుగా అక్రమ రవాణాకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు కూడా బనాయించాలని సూచించారు. ఐవిఆర్ఎస్ సిస్టం ద్వారా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. డెలివరీ సిస్టంలో మార్పులు చేయాలన్నారు. మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ ద్వారా నిత్యవసరాలు సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర వుతున్నాయని పూర్వపు డీలర్ వ్యవస్థను పునర్ద రించి అమలయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అను గుణంగా మెనూ ప్రకారం లక్షిత చిన్నారులు, విద్యార్థులకు పోషక విలువలు మెండుగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎండియు వాహనాలలో సిసి కెమెరాలు నిఘా కొరకు ఏర్పాటు చేయాలని సూచిం చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పౌష్టికాహారం అందించడంలో భాగంగా ఏరకంగా తయారు చేసి తాజాగా వండి వడ్డిస్తే ఎక్కువ మంది పిల్లలు ఇష్టపడి తింటున్నారో ఆయా రీతిలో కార్య క్రమాలు అమ లు చేస్తూ ప్రభుత్వ ఆశయాలను సిద్ధింప చేయాల న్నారు. అదేవిధంగా పౌరసరఫరాల వ్యవస్థ పూర్తిస్థాయిలో సజావుగా సేవలు అందించే దిశగా పలు సూ చనలు చేయాలని ఆమె కోరారు ఈ సూచనలు అన్నింటిని క్రోడీక రించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో డిఎస్ఓ ఏ పాపారావు ఆర్‌డిఒ జి.కేశవర్ధన్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ ఎం.ఝాన్సీ రాణి, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ పి.జ్యోతిలక్ష్మి దేవి, బిసి వెల్ఫేర్, ఎస్‌సి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల అధికారులు డిఇఒ కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి బీమా చెక్కుల అందజేత

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రమాదాలకు గురైన పలువురి జనసేన కార్యకర్తలకు ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు ప్రమాద బీమా చెక్కులను పార్టీ శ్రేణులతో కలసి బుధవారం కూడా అందజేశారు. ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని ఎంతోమందికి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. జనసేన కార్యకర్తలకు ఏ కారణం చేతనైనా ప్రమాదాలు సంభవిస్తే వారికి పార్టీ ఆర్థిక సాయంతో భరోసా ఇస్తుందన్నారు. ఇందుకు జనసేనలో క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. అటువంటి వారికి నష్టం వాటిల్లితే తప్పక బీమా వర్తిస్తుందన్నారు. సభ్యత్వాల నమోదుకు గడువు వచ్చేనెల 5 వరకు పొడిగించారన్నారు. ఇప్పటికే పెదపళ్లలో ముగ్గురికి, సంధిపూడిలో ఒకరికి చెక్కులు అందజేశామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సంగీత సుభాష్, సూరపరెడ్డి సత్య, తోట వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, తమ్మన భాస్కరరావు, పడాల అమ్మిరాజు, పెద్దిరెడ్డి పట్టాభి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ .4 కోట్ల పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అనంతరం జరిగిన అత్యవసర సమావేశాలలో రూ.నాలుగు కోట్ల పనులకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. ఈ సర,ర్భంగా మున్సిపల్ ఛైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు వాడ్రేవు సాయిప్రసాద్ ఆధ్వర్యంలో రెండు అంశాలను తిరస్కరించారు. 5వ అంశం సిడిఎంఎ ఆమోదం తీసుకోవాలని సభ్యులు సూచించారు. అదేవిధంగా ఎనిమిదవ అంశం వాయిదా వేశారు. ఈ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.